ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

చెత్త రహిత జిల్లా కోసం పని చేయాలి

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల నూనెపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లాను చెత్తరహిత జిల్లాగా మార్చడానికి బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సెంటినరి హాల్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025పై ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకడమిక్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న గ్రామాలను, అక్కడ నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి పరిశుభ్రంగా ఉన్న గ్రామాలకు ర్యాంకులు కేటాయిస్తారని అన్నారు. అందుకు ఐఐఎంఎస్ డేటా నుంచి వారు ఎంపిక చేసుకున్న గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ అంశాలపై నిర్వహిస్తున్న కార్యకలాపాలను పూర్తిస్థాయిలో పరిశీలించి మార్కులు నిర్ణయిస్తామన్నారు.

జిల్లా వ్యవసాయాధికారిగా వెంకటేశ్వర్లు



బాధ్యతలు చేపట్టిన నున్నా వెంకటేశ్వర్లు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యవసాయాధికారిగా నున్నా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల డీఏవోగా పనిచేస్తున్న వైపీ మురళీకృష్ణ గుంటూరు వ్యవసాయ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో గుంటూరు డీఏవోగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు బదిలీపై నంద్యాలకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన డీఏవోకు ఏడీఏలు, కార్యాలయ అధికారులు అయూబ్, శారదమ్మలతో పాటు నంద్యాల మండల ఏవో ప్రసాద్ తదితర ఏవోలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి వ్యవసాయాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు



నంద్యాల హాస్పిటల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తల నియామకం చేపట్టామని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31 ఆశా కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 24, పట్టణ ప్రాంతాల్లో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోతరగతి విద్యార్హతగా ఉండాలని గౌరవ వేతనం రూ.10వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ నెల 28నుంచి వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అర్బన్ ప్రాంతం వారు వార్డు సచివాలయాల పరిధిలోని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు దరఖాస్తులు అందజేయాలన్నారు.

రక్షణలేని రారాజు



రుద్రవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నల్లమలకు పెద్దపులి రారాజు. రారాజుకే నల్లమలలో రక్షణ కరువైంది. ఏడాదికేడాదికి పెద్దపులుల సంఖ్య నల్లమలలో గణనీయంగా పెరుగుతోంది. పెద్ద పులులు, చిరుత పులుల సంరక్షణలో అటవీశాఖాధికారులలో నిర్లక్ష్యం కనబడుతోంది. రకరకాల ప్రమాదాల్లో పెద్దపులులు, చిరుతలు మృత్యువాత పడుతున్నాయి. నల్లమలలో శ్రీశైలం, నాగార్జునసాగర్ టైగర్ ప్రాజెక్టు 3,728 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఇందులో ఉన్న పెద్దపులులు ఉచ్చులకు బలవుతున్నాయి. రుద్రవరం రేంజ్‌లో ఒక పెద్ద పులి కళేబరం నీటిలో లభించింది. మరో పెద్దపులి రైలు ఢీకొనడంతో మృతి చెందింది. రుద్రవరం సబ్ డివిజన్‌లోని చెలిమరేంజ్ పెద్దకంబలూరు సెక్షన్ పరిధిలో వేటగాళ్లు ఉచ్చులు వేయడంతో పెద్దపులి బలైంది. ఆ పులి కళేబరం రుద్రవరం రేంజ్‌లోని తుండ్లవాగు రిజర్వాయరులో లభించింది. చిరుతలు కూడా నీటిలో, రోడ్డు ప్రమాదాల్లో రైలు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నాయి.



- ఉచ్చులకు బలవుతున్న పెద్దపులులు
- నీరు, రోడ్డు, రైలు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న చిరుతలు
- నివేదికలకే పరిమితమైన రైలు మార్గం పనులు
- టి90 పెద్దపులి పదిలమేనా..?
- చోరీకి గురైన కెమెరా ట్రాప్‌లు

పెరిగిన పెద్దపులుల సంఖ్య

ఎన్ఎస్‌టీఆర్‌తో పాటు నల్లమలలో పెద్దపులుల సంఖ్య సుమారు 90 నుంచి 95 వరకు పెరిగినట్లు ఫారెస్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీటిలో గుర్తించినవి కొన్ని, గుర్తించనివి కొన్ని. ఐడీ నెంబర్లు కొన్నింటికి ఇచ్చినట్లు ఫారెస్టు శాఖ లెక్క చెబుతోంది.

నివేదికలకే పరిమితమైన ఫెన్సింగ్ పనులు

నల్లమల అటవిలో రైలు మార్గంలో రెండు వైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఫారెస్టు అధికారులు రైల్వే శాఖకు నివేదికలు 2022లో పంపించిన విషయం విదితమే. నివేదికలకు ఫెన్సింగ్ పనులు పరిమితమయ్యాయి. తరచూ రైలు ఢీకొని పులి, చిరుతలు మృత్యువాత పడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం రెండో వరుస రైల్వే పనులు కొనసాగుతున్నాయి. ఫెన్సింగ్ పనులు మాత్రం పూర్తి కాలేదు.



రుద్రవరం రేంజ్ అహోబిలం సమీపంలో పెద్దపులి కోసం గాలిస్తున్న ఫారెస్టు అధికారులు (ఫైల్)

టి90 పెద్దపులి పదిలమేనా..?

నల్లమల నంద్యాల రేంజ్‌లో టి90 పెద్దపులి ఇటీవల సంచరించిన విషయం విదితమే. టి90 పెద్దపులి గాయపడి సంచరిస్తుందన్న సమాచారం అప్పట్లో ప్రచారమైంది. టి90 పెద్దపులి పదిలంగా ఉన్నట్లేనా..? నల్లమల అటవిలో నంద్యాల రేంజ్, చెలిమ రేంజ్‌లలో కనిపించడంలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి..? ఇంతకూ టి90 పెద్దపులి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. వన్యప్రాణుల సంరక్షణకై నల్లమల అడవిలో కెమెరా ట్రాప్‌లు ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేశారు. రుద్రవరం రేంజ్‌లో సుమారు పది కెమెరా ట్రాప్‌లు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు స్టేషన్‌లో ఫారెస్టు అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఫారెస్టు శాఖలో ట్రైన్ పార్టీ ఏర్పాటు చేయాలి. ట్రైన్ పార్టీ ఉందా? లేదా? అనే విమర్శలు ఉన్నాయి. ఈ ట్రైన్ పార్టీ వన్యప్రాణులు రైలు ప్రమాదం బారిన పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతుంది.

పెద్దపులుల సంరక్షణకు చర్యలు



నల్లమలలో పెద్దపులుల సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం. వాటి ఆహారం కోసం చెలిమ రేంజ్‌లో 40 జింకలు ఇటీవలనే వదిలాం. వేటగాళ్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి వివరాలు సేకరిస్తున్నాం. రైలు మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటుకు ఫారెస్టు ఉన్నతాధికారులు రైల్వేశాఖకు నివేదికలు పంపించారు.

శ్రీనివాసులు, సబ్‌డీఎఫ్‌వో, రుద్రవరం సబ్ డివిజన్

న్యూస్ బాక్స్

డీఎస్సీ పరీక్షలకు 248 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం రెండు సెషన్స్‌లో నిర్వహించిన పరీక్షలకు 248 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో మొదటి సెషన్‌లో నిర్వహించిన టీజీటీ (నాన్‌లాంగ్వేజి) సోషియల్ పరీక్షకు మొత్తం 871 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 748 మంది అభ్యర్థులు హాజరై 123 మంది గైర్హాజరయ్యారు. రెండవ సెషన్‌లో టీజీటీ(నాన్ లాంగ్వేజి)-సోషియల్, పరీక్షకు 873 మంది అభ్యర్థులు హాజరుకావాల్సివుండగా 748 మంది హాజరై 125 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 170 మంది హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 170 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1,04,001వ ర్యాంక్ నుంచి 1,20,000వ ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహించగా 170 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ తెలిపారు.

ఏఎస్పీ చంద్రబాబు బదిలీ



నంద్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఏఆర్ ఏఎస్పీ జి.చంద్రబాబు బదిలీ అయ్యారు. ఆయన్ను విజయవాడలోని ఏపీజెన్‌కో కేంద్రానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే నంద్యాలకు మాత్రం ఇంకా ఎవరినీ నియమించలేదు.

25 శాతం సీట్లు కేటాయించాల్సిందే

- ప్రైవేట్ పాఠశాలలు క్రమం తప్పకుండా అమలు చేయాలి
- 12(1)(సి)ని నిర్లక్ష్యం చేసే ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు
- సర్వశిక్ష ఏపీసీ ప్రేమంత్‌కుమార్



వెబెక్స్ ద్వారా ఎంఈవోలతో మాట్లాడుతున్న ఏపీసీ ప్రేమంత్‌కుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల పిల్లలకు 12(1)(సి)చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు తప్పకుండా కేటాయించాల్సిందేనని సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ప్రేమంత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని అన్ని మండల విద్యాధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. శుక్రవారం ఏపీసీ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో తప్పకుండా పిల్లలను చేర్చుకోవాల్సిందేనని అన్నారు. 12(1)(సి)ని నిర్లక్ష్యం చేసిన ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. పిల్లలను చేర్చుకోకుండా ఎందుకు తిరస్కరిస్తున్నారో, అలాంటి వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని అన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహించే ఎంఈవోనే బాధ్యులను చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆధార్ కార్డు లేని విద్యార్థులకు...

ఆధార్‌కార్డు లేని విద్యార్థులను సీఆర్‌పీల ద్వారా గుర్తించాలని, ఆ విద్యార్థులకు తహసీల్దార్‌ల చేత నాన్ అవైలబులిటీ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని ఏపీసీ ఎంఈవోలను ఆదేశించారు. ఎన్ఏసీ వచ్చిన తర్వాత నోటరీ చేయించి ఆ విద్యార్థి కుటుంబంలో ఉన్న ఏదో ఒక్క గుర్తింపు కార్డు తీసుకుని సచివాలయం వెళ్లి పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేయించాలని అన్నారు. ఆ తర్వాత ఆధార్ నమోదు నంబర్‌ను తీసుకోవచ్చన్నారు.

బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించాలి

బడి మధ్యలోనే మానేసిన పిల్లలను పాఠశాలల్లో తిరిగి చేర్పించేలా గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిలో అంగన్‌వాడీలతో, సీఆర్‌పీలతో, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశాలు నిర్వహించి ప్రతి విద్యార్థిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీసీ సూచించారు. జూలై 5వతేదీన మెగా పేరెంట్స్ ఈవెంట్ నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ ప్లానింగ్ జగన్, ఏఎంవో మాధవీలత, అసిస్టెంట్ ఏఎంవో యూనస్‌బాషా, అసిస్టెంట్ సీఎంవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అధికారుల్లో కలవరం..!

- ఆంధ్రజ్యోతి కథనంతో మొదలైన అలజడి
- చాంద్‌బాషా వ్యవహారంపై అటవీ, పోలీసు శాఖలు సీరియస్
- రూ.కోట్లు కొట్టేసిన కేసుపై ఆరా తీస్తున్న నంద్యాల ఎస్పీ
- యూనియన్ బ్యాంకు సిబ్బంది అప్రమత్తం



చాంద్‌బాషా

ఆత్మకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోనే సంచలనంగా మారిన ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని ఓ ఉద్యోగి చేతివాటం ప్రస్తుతం ఆ శాఖ అధికారులను కలవరానికి గురిచేస్తోంది. అంతేకాదు ఈయనతో చేతులు కలిపి అక్రమాలకు వంతుపాడిన ముఖ్య అధికారుల్లో అలజడి మొదలైంది. వాస్తవానికి ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో ఏళ్ల తరబడి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి 2024 జూలైలో రిటైర్డు అయిన చాంద్‌బాషా.. తన పని చేసిన సమయంలో ఫారెస్టు చెక్‌పోస్టుల నుంచి వచ్చిన ఆదాయాన్ని ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్)కు, ఇతర సంస్థలకు ఆర్టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేసే ప్రక్రియలో చేతివాటం ప్రదర్శించి కోట్ల రూపాయలు స్వాహా చేశాడు. ఈ వ్యవహారంపై ఇప్పటికే అటవీశాఖ ఉన్నతాధికారులు చాంద్‌బాషాపై పోలీసు కేసు నమోదు చేయించడంతో పాటు అక్రమాలను వెలికితీసేందుకు ఆరుగురితో కూడిన ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించారు. అయితే అప్పటికే పరారీలో ఉన్న చాంద్‌బాషాను పట్టుకోవడంతో పాటు ఆయన చేసిన అక్రమాలను పూర్తిస్థాయిలో వెలికితీయడంలో ఆయా విభాగాల అధికారుల విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'నల్లమలలో కళ్లుగప్పి.. రూ.కోట్లు కొట్టేశాడు' కథనానికి పోలీసు, అటవీ, యూనియన్ బ్యాంకు అధికారులు అప్రమత్తమైనట్లు తెలిసింది. నిజానికి 2024 సంవత్సరంలోని ఏప్రిల్, మే నెలల్లో చాంద్‌బాషా సుమారు రూ.19లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు అటవీ అధికారులు గుర్తించారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మిగతా 7వ పేజీలో

ఓర్వకల్లుకు మరో భారీ పరిశ్రమ 7



ఉద్యాన పంటలకు పెద్ద పీట



- 4500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యం
- ఇప్పటికే 2400 ఎకరాల గుర్తింపు
- ఈ నెల ఆఖరికి ఎంపిక పూర్తి

నంద్యాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యాన పంటలకు పెద్దపీట వేస్తోంది. రైతులకు అన్ని విధాలుగా కలిసి వచ్చేలా చర్యలు తీసుకుంది. ఉపాధి హామీ పథకం 2025-26 కింద జిల్లాలో 4500 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలను పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. దీంతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) యంత్రాంగం సైతం ఆ దిశగా అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లాలో 2400 ఎకరాల పండ్ల తోటల పెంపకాన్ని గుర్తించారు. గతంలో కేవలం 2500 ఎకరాలు మాత్రమే సాగైనట్లు తెలుస్తోంది. కానీ 4500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం ఉండాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. దీని కోసం ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రైతులకు అర్హతలు.. అందించే ఖర్చులు...

- ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులు.
- రైతులకు తప్పనిసరిగా జాబ్ కార్డు ఉండాలి.
- వర్షాధారిత, సాగునీటి వసతి ఉండాలి.
- రైతులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా పంటల సంరక్షణ, నిర్వాహణ ఖర్చులు చెల్లింపు.
- పండ్ల తోటల పెంపకం రైతులకు 2-3 సంవత్సరాల వరకు రైతులకు ఖర్చులు చెల్లిస్తారు.

2400 ఎకరాలు గుర్తింపు..

పండ్ల తోటల పెంపకానికి డ్వామా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటికే లక్ష్యంలోని 4500 ఎకరాలకుగాను.. 2400 ఎకరాలకు రైతులను గుర్తించారు. మిగిలిన 2100 ఎకరాలను ఈ నెల ఆఖరిలోపు గుర్తించడానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో డోన్ నియోజకవర్గంలోని రైతులు ఎక్కువగా పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

ఏ పంటలంటే....

ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం మామిడి, జీడీ మామిడి, పెద్దరేగు, అవకాడో, దానిమ్మ, అంజూర, బత్తాయి, నిమ్మ, జామ, సీతాఫలం, తైవాన్‌జామ, సపోటా, కొబ్బరి, ఆల్లనేరడు, చింత, పనస, డ్రాగన్‌ఫ్రూట్, గులాబీ, మల్లెలు, మునగ, కోకో, జాఫ్రా, ఆయిల్‌పామ్ పంటలకు అవకాశం కల్పించింది.



రైతులు ఆలోచించి ఎంపిక చేసుకోవాలి



ప్రభుత్వం పండ్ల తోటలకు అవకాశం కల్పించింది. ఆసక్తి ఉన్న రైతులు తమ మండల పరిధిలో ఏపీవోల వద్ద దరఖాస్తు చేసుకోండి. ఇప్పటికే 50శాతం ఎంపిక చేశాం. ఈ నెల ఆఖరికి ప్రభుత్వ లక్ష్యానికి చేరుకుంటాం. రైతులు తమ భూముల్లో అనువైన పండ్ల తోటలు సాగు గురించి ఆలోచించి ఎంపిక చేసుకోవాలి.

-సూర్యనారాయణ, డ్వామా పీడీ



ఓర్వకల్లుకు మరో భారీ పరిశ్రమ

- స్థాపించేందుకు ముందుకొచ్చిన రిలయన్స్ సంస్థ
- రూ.1,622 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకు అనుమతి
- ఇండస్ట్రియల్ కారిడార్‌లో 80ఎకరాలు కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి



కర్నూలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పారిశ్రామికవాడ (ఇండస్ట్రియల్ కారిడార్)లో భారీ పరిశ్రమ స్థాపనకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చింది. రూ.1,622 కోట్ల పెట్టుబడితో స్థాపించే ఈ పరిశ్రమలకు 80 ఎకరాలు భూమి కేటాయించారు. పరిశ్రమ స్థాపనకు, భూకేటాయింపులకు అనుమతులు ఇస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఓర్వకల్లు సిగలో మరో భారీ పర్రిశమ వచ్చి చేరింది. త్వరలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు మొదలు పెట్టారు. రిలయన్స్ సంస్థ రూ.1,622కోట్లతో పెట్టుబడితో శీతలపానీయాలు, జ్యూస్, తాగునీరు తయారీ పరిశ్రమను కర్నూలు జిల్లాకు తీసుకురావడంతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉంది. సీఎం చంద్రబాబు, యువనేత, మంత్రి నారా లోకేశ్‌తో చర్చించి రిలయన్స్ యాజమాన్యాన్ని ఒప్పించి ఇక్కడకు తీసుకొచ్చారు. ఈ పరిశ్రమ ఏర్పాటు అయితే స్థానికంగా 1,200మందికి ప్రత్యేక్షంగా ఉపాధి లభిస్తే.. పరోక్షంగా మరో వందలాది మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఓర్వకల్లు ఏపీఐఐసీ ల్యాండ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసే అ పరిశ్రమకు ఎకరం రూ.30లక్షలు చొప్పున 80 ఎకరాలు కేటాయించారు. ఈ నెల 19న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం జీవో జారీచేసింది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 ప్రకారం అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తారని తెలుస్తుంది. 2026డిసెంబర్‌లోగా ఉత్పత్తి ప్రారంభిం చేలా తక్షణమే పనులు మొదలు పెట్టాలని ప్రభుత్వ లక్ష్యం. సంబంధిత శాఖ మంత్రి టీజీ భరత్ రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో పలుమార్లు సంప్రదించినట్లు తెలుస్తుంది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేశారు. పలు పరిశ్రమలు స్థాపనకు చర్యలు చేపట్టారు. అయితే.. 2019లో జగన్ ప్రభుత్వం రావడంతో లక్ష్యం మరుగున పడింది. ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ పరిశ్రమలు రావడంతో మొదలయ్యాయి. అదే క్రమంలో 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ ను రూ.2,786 కోట్లతో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. టెండర్లు కూడా పూర్తి చేసింది. వివిధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు రాబట్టి, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యం. అందులో భాగంగా తాజాగా దేశంలో దిగ్గజ సంస్థల్లో ఒకటైన రిలయన్స్ ఓర్వకల్లు కేంద్రంగా భారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రావడం సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు భూమి పూజ చేసిన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ పరిశ్రమ కూడా మరో 400 ఎకరాల్లో విస్తరణకు చర్యలు చేపట్టింది.

జగన్ రీ సర్వేతో భూమి కోల్పోయా..

- 2 ఎకరాలకు గాను 1.32 ఎకరాలే చూపుతోంది
- వైరల్ అయిన వీడియోలో ఓ సైనికుడి ఆవేదన


జవాన్ షేక్ ఖలీల్

ఎమ్మిగనూరు/నందవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయంలో జగన్ చేపట్టిన భూ రీసర్వే వైఫల్యంతో తాను భూ మిని కోల్పోయానని దేశ సరిహద్దు ల్లో విధులు నిర్వహిస్తున్న బీఎస్ ఎఫ్ జవాన్ షేక్ ఖలీల్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన విడుద ల చేసిన వీడియో వైరల్‌గా మారింది. తనకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ న్యాయం చేయాలని ఆ వీడియోలో కోరారు. నందవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన షేక్ ఖలీల్ తల్లిదండ్రులు కూలిపనులు చేస్తూ జీవిస్తున్నారు. 1996లో గురుజాల గ్రామ పరిధిలో సర్వే నం 193బీలో (ఖాతా నెం. 330) రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఆయన తల్లి నబూబీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారు. 1996 నుంచి 2022 వరకు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్, అడంగల్‌లో వారి పేర్లే ఉన్నాయి. భూమిపై బ్యాంకులో రుణం కూడా తీసుకున్నారు. అయితే 2022లో వైసీపీ ప్రభుత్వం చేసిన భూముల రీసర్వేలో 1.32 సెంట్లు వచ్చింది. మిగతా భూమి పక్క పొలంతో కలిసిపోయింది. రీసర్వే పుణ్యమా అని దాదాపు 0.68 ఎకరాల భూమి కోల్పోయారు. సెలవులపై వచ్చిన జవాన్ షేక్ ఖలీల్ అప్పటిలోనే మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా న్యాయం జరగలేదు. దీంతో 2022లో రెండు మూడుసార్లు కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో భూమి గురించి ఫిర్యాదు చేశారు. నందవరం తహసీల్దార్ కార్యాలయం అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోలేదు. గ్రామ స్థాయి అధికారులు, వైసీపీ నాయకులు కూడా న్యాయం చేయలేదు. భార్యాపిల్లలను వదలి దేశం కోసం సరిహద్దుల్లో రాత్రింబవళ్ల ప్రాణాలు ఒడ్డి విధులు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లకు రెవిన్యూ అధికారులు చేస్తున్న న్యాయం ఇది అని జవాన్ షేక్ ఖలీల్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు చేరితే అయినా తనకు న్యాయం జరుగుతుందని అందులో అన్నారు. ఈవిషయాన్ని నందరం తహసీల్దార్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా.. తనకు తెలియదని అన్నారు.

తిప్పలదొడ్డిలో చిరుత హల్‌చల్

- భయాందోళనలో గ్రామ ప్రజలు



పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కౌతాళం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలంలోని తిప్పలదొడ్డి గ్రామంలో శుక్రవారం ఓ చిరుత హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. తిప్పలదొడ్డిలోని కరిణి గ్రామ రస్తాలో ఉన్న ఓ రైతు పొలంలోని టెంకాయ చెట్టుపై చిరుత కనిపించింది. దీంతో ప్రజలు, అటుగా వెళ్తున్న కూలీలు భయభ్రాంతులకు గురయ్యారు. చిరుతను చూసేందుకు చుట్టుపక్క గ్రామాలైన కరణి, చూడి, కొలమాన్‌పేట, మల్లనహట్టి గ్రామాల ప్రజలు వందలాదిగా సమీపానికి చేరుకున్నారు. గ్రామ సర్పంచ్ మల్లయ్య కౌతాళం పోలీసులకు, ఆదోని అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అధికారులు వచ్చేలోపు చెట్టుపై ఉన్న చిరుత ప్రజలను చూసి కిందకు దూకి పారిపోతుండగా కుక్కలు వెంటపడ్డాయి. గాయపడిన కుక్కలు ప్రతిదాడి చేయగా చిరుత అక్కడి నుంచి సమీపంలోని ముళ్ల పొదల్లోకి చేరింది. అక్కడకు వచ్చిన అటవీ శాఖ ఆదోని డివిజనల్ అధికారి తేజస్విని తమ సిబ్బందితో ఘటన స్థలం నుంచి ప్రజలను దూరంగా పంపించేశారు. అంతలోనే ముళ్ల పొదల్లో దాగి ఉన్న చిరుత బయటకు వచ్చి సమీపంలోని మరో పొలంలోకి చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అటవీ శాఖ అధికారులు చిరుతను బంధించేందుకు ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

మహానందిలో ఆవుపై చిరుత దాడి

మహానంది, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం నల్లమల అటవీ క్షేత్ర పరిధిలో శుక్రవారం ఆవుపై ఓ చిరుత దాడి చేసి చంపేసింది. మండలంలోని ఎంసీ ఫారం శ్రీవెంకటేశ్వర పశుపోషణ కేంద్రానికి చెందిన ఆవులు మేతకోసం సమీపంలోని నల్లమలలోకి వెళ్లాయి. ఇందులో భాగంగా నల్లమలలోకి వెళ్లిన ఒక ఆవుపై చిరుత డాడి చేసి హతమార్చింది. ఈ విషయంపై పశుపోషణ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ధర్మారావును వివరణ కోరగా కేంద్రానికి చెందిన ఆవులమంద మేతకోసం సమీపంలోని అడవిలోకి వెళ్లాయన్నారు. ఇందులోని ఒక ఆవుపై అటవీ వన్యప్రాణి చేయడంతో మృతి చెందిందన్నారు. దాడి చేసింది చిరుతనా లేక మరేదైనా జంతువు అన్నది తెలియాల్సి ఉందన్నారు. ఆవుకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు ఆయన తెలిపారు.

మంత్రి చొరవతో బాంబే ఐఐటీలో సీటు



మంత్రి బీసీని కలిసిన దివ్యాంగ విద్యార్థి, ఆయన తల్లిదండ్రులు

బనగానపల్లె, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో నంద్యాల పట్టణానికి చెందిన దివ్యాంగ విద్యార్థి శబరీష్ ప్రతిష్టాత్మకమైన బాంబే ఐటీఐలో సీటు సంపాదించారు. తనకు సీటు కల్పించిన మంత్రి బీసీకి శుక్రవారం విద్యార్థి శబరీష్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు అరవేటి కృష్ణమూర్తి, పుష్పావతి దంపతులు అభినం దించారు. నంద్యాలకు చెందిన శబరీష్ అనే దివ్యాంగ విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌లో ఫిజికల్ హ్యాండీ క్యాప్ కోటాలో ఆలిండియా మూడో ర్యాంకు సాధించాడు. ఇంటర్‌లో 5 సబ్జెక్టులు కాగా అతని శారీరకస్థితి బాగాలేక ఇంటర్ అకాడమీ 4 సబ్జెక్టులు చదివేందుకు ప్రత్యేక అనుమతి ఇచ్చింది. ఐటీలో ర్యాంకు వచ్చినా 5 సబ్జెక్టులు చదువలేదని కారణంతో సీటు ఇచ్చేందుకు ఐటీ బోర్డు నిరాకరించింది. ఈవిషయమై విద్యార్థి తల్లిదండ్రులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వద్ద తమ సమస్యను విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి బీసీ ప్రభుత్వం తరుపున బోర్డును సంప్రదించడంతో ఎట్టకేలకు బాంబే ఐటీలో శబరీష్‌కు సీటు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో విద్యార్థి, తల్లిదండ్రులు, శుక్రవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలుసుకొని ఆయనను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల్లో కలవరం..!

(5వ పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే 2025 ఏప్రిల్ 20వ తేదిన ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా చాండ్‌బాషా చేసిన అక్రమాల గురించి ఆధారాలతో సహా వెల్లడించారు. ఆతర్వాత ఏప్రిల్ 21వ తేదిన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇంతవరకు అంతా బాగానే ఉన్నప్పటికీ అటవీ అధికారులు పూర్తిస్థాయిలో విచారించకుండా రూ.19లక్షల వరకు చాండ్‌బాషా నుంచి రికవరీ చేసినట్లు తెలిసింది. వాస్తవానికి ఓ వైపు పోలీసు స్టేషన్ కేసు నమోదైనప్పటికీ పోలీసుల ప్రమేయం లేకుండా అటవీ అధికారులు రికవరీ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ.4.35 కోట్ల అక్రమాలు జరిగితే పూర్తి విచారణ చేపట్టకుండా హడావిడిగా రూ.19లక్షల రికవరీ చేయడం విమర్శలకు దారితీసింది. ఆతర్వాతే ఈ వ్యవహారంలో భాగస్వాములైన నిందితులు పరారైనట్లు తెలిసింది.



కుబేరా సినిమా తరహాలో..

చాండ్‌బాషా చేసిన అక్రమాల్లో ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూస్తున్నాయి. చెక్కులను దారిమళ్లించే క్రమంలో కుబేరా సినిమా తరహాలో చాండ్‌బాషా తనదైన శైలిలో అవకతవకలకు పాల్పడ్డాడు. చాండ్‌బాషాకు పరిచయస్తుడైన మహేశ్వర ప్రింటర్స్ నిర్వాహకులు వెంకట శివయ్యతో పాటు అతని భార్య, తల్లి బ్యాంకు ఖాతాలకు భారీగా ఆర్టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేసి అతని నుంచి పలు దుకాణాలకు యజమానులకు మళ్లించి వారి వద్ద డబ్బు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. అదేక్రమంలో వెంకటశివయ్య వద్ద పనిచేసే శ్రీను అనే ఓ దివ్యాంగుడి ఖాతాలో కూడా సుమారు రూ.20లక్షల వరకు నగదు మళ్లించి డ్రా చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం గురించి సదరు దివ్యాంగుడైన శ్రీనుకు ఏమీ తెలియకపోవడం గమనార్హం.

ఆంధ్రజ్యోతి కథనంతో అప్రమత్తం

ఆత్మకూరు అటవీ శాఖను కుదిపేసిన చాండ్‌బాషా వ్యవహారంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంతో పోలీసు, అటవీ, బ్యాంకు అధికారులు మరింత అప్రమత్తమైనట్లు తెలిసింది. ప్రత్యేకించి ఈ కేసుపై తొలి నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. నిందితులను పట్టుకోవాలని ఎప్పటికప్పుడు కేసు పురోగతిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. దీంతో పోలీసు అధికారులు కూడా పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదిలావుంటే రూ.కోటి దాటే కేసులను సీఐడీకి అప్పగించే అవకాశం ఉంటుంది. కానీ పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఈ కేసును స్థానిక పోలీసులకే అప్పగించడం వల్ల దర్యాప్తు కొంత మందకొడిగా సాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ కేసును సీఐడీకి అప్పగించే అవకాశం లేకపోలేదు. అదేవిధంగా చాండ్‌బాషా అక్రమాల గుట్టును పూర్తిస్థాయిలో వెలికితీసేందుకు పీసీసీఎఫ్ ఏకేనాయక్ ఆరుగురుతో కూడిన బృందాన్ని నియమించారు. అయితే ఆ బృందం ఇప్పటివరకు ఒక్కరోజు కూడా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేదని తెలిసింది. దీంతో వారు కూడా అక్రమాలపై విచారణ చేపట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అదేవిధంగా చాండ్‌బాషా వ్యవహారంలో కీలకంగా మారిన యూనియన్ బ్యాంకులో ఆర్టీజీఎస్ నెఫ్ట్ ఫారంలో కూడా చెక్కు హోల్డర్ సంతకం లేకుండా చాండ్‌బాషా, ఇతరుల సంతకాల ద్వారా నగదు బదిలీ చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు వారిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి ఆంధ్రజ్యోతి కథనంలో అప్రమత్తమైన యూనియన్ బ్యాంకు రీజనల్ అధికారులు శుక్రవారం సాయంత్రం స్థానిక బ్రాంచ్ సిబ్బందితో సమావేశమై ఈ అంశంపై చర్చించినట్లు తెలిసింది.

అటవీశాఖకు తలవంపులు..!

ఇంతకాలం గుట్టుగా సాగుతున్న అటవీశాఖలో భారీ కుంభకోణం వెలుగుచూడటంతో ఆశాఖకు తలవంపులు వచ్చినట్లయింది. దీంతో అందులో నిజాయితీగా పనిచేసే అధికారులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రజల నుంచి అనేక రూపాల్లో వసూళ్లు చేసిన కోట్ల రూపాయల ప్రజాధనం దారిమళ్లడంపై వారు సైతం మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ఈ తప్పిదాలు చోటుచేస్తున్నట్లు చెబుతున్నారు. అంతేకాదు ప్రతిఏటా జరిగే ఆడిట్‌ను కూడా సక్రమంగా చేసిఉంటే ఈ పరిస్థితులు వచ్చేవి కావని అభిప్రాయపడుతున్నారు. ఈ కేసును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని సిట్ లేదా విజిలెన్స్ వంటి దర్యాప్తు సంస్థలతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయం

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


ఎమ్మెల్యే కోట్ల, ఎంపీ బైరెడ్డి శబరిలకు టీడీపీ నాయకుల విజయోత్సవ ర్యాలీ

బేతంచెర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, తెలిపారు. మండలంలోని సిమెంటునగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని ఎమ్మెల్యేతో పాటు ఎంపీ బైరెడ్డి శబరి శుక్రవారం పునఃప్రారంభించారు. సిమెంటునగర్ ముఖద్వారం నుంచి కార్మికులు, ప్రజలు పూలవర్షంతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలో సీఈవో శేషారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి కార్మికులను ఆదుకున్న యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోట్లతో పాటు మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ ఉండటంతో ప్రజలసమస్యలను పరిష్కరించడంలో ఆమె ముందుంటారనీ తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయిన సిమెంటు ఫ్యాక్టరీ నుంచి సిమెంటు సరఫరా చేసే లారీలను ఎంపీ, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, నాయకులు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, వర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు


శ్రీశైలం చేరుకున్న తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికామల్లికార్జున స్వామిని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆలయ అధికారులు, వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఏడీఏల బదిలీ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో ఏడీఏలను బదిలీ చేస్తూ కమిషనర్ డిల్లీరావు ఉత్తర్వులు ఇచ్చారు.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్నది	బదిలీ అయిన స్థానం
డి.రాజశేఖర్	నంద్యాల	కర్నూలు(ఆగ్రో)
పి.అశోకవర్ధన్‌రెడ్డి	డోన్	ఎమ్మిగనూరు (సాయిల్ టెస్టింగ్ ల్యాబ్)
కేవీ నాగరాజు	డోన్(ఎస్‌సీ)	బద్వేల్
ఎం.సునీత	ఆలూరు	డోన్
ఎన్.సుధాకర్	నంద్యాల(డీటీసీ)	కోవెలకుంట్ల
కె.అరుణకుమారి	ఆదోని	కర్నూలు(డీటీసీ)
ఎం.చెంగల్రాయుడు	తాడిపత్రి	ఆలూరు
ఎస్.శ్రీనివాసరావు	సీకేదిన్నె(ఎంఎస్‌టీఎల్)	నంద్యాల(డీటీసీ)
బి.బాలవర్ధిరాజు	కర్నూలు(ఆగ్రో)	ఆదోని
పి.సురేష్	ప్రొద్దుటూరు	డోన్(ఎస్‌సీ)
బి.ఆంజనేయ	ఆత్మకూరు	నంద్యాల
సి.విజయశేఖర్	నందికొట్కూరు	ఆళ్లగడ్డ
ఎం.గిరీష్	కర్నూలు(డీటీసీ)	నందికొట్కూరు

డీసీఎంఎస్ బలోపేతానికి సహకరించాలి

- కలెక్టర్‌కు చైర్మన్ వినతి


కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు వివిధ ప్రయోజనాలను అందిస్తున్న జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ (డీసీఎంఎస్)ను బలోపేతం చేసేందుకు అన్ని విభాగాల అధిపతులకు ఆదేశాలు ఇవ్వాలని చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ కలెక్టర్ పి.రంజిత్ బాషాకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో శుక్రవారం చైర్మన్‌తో పాటు మేనేజర్ రాజేష్ కలెక్టర్‌ను కలిశారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు మార్క్‌ఫెడ్ ద్వారా అందించేందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే జనరిక్ మందులను తక్కువ ధరకే అందించేందు కోసం డీసీఎంఎస్ సంస్థ నిర్ణయించిందని, కలెక్టరేట్ ప్రాంగణంలో తమకు స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం చైర్మన్‌తో పాటు మేనేజర్ జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, జిల్లా సహకార శాఖ అదికారి వెంకటకృష్ణను కలిశారు. ఎరువులతో పాటు రైతులకు అవసరమైన అన్ని సేవలను డీసీఎంఎస్ ద్వారా అందించే విదంగా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు చిత్తగిస్తారా..

- వ్యవసాయాన్ని ఆదుకుంటారా?
- పారిశుధ్యం మెరుగుపడేనా?
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం



కర్నూలు న్యూసిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం శనివారం నిర్వహించేందుకు జడ్పీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మంత్రి టీజీ భరత్‌తో పాటు రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులు, శాసనసభ్యులు, ఎంపీలు హాజరుకానున్నారు. గత సమావేశంలో జడ్పీటీసీలు లేవనెత్తిన సమస్యలను ఈ సమావేశంలో పరిష్కరిస్తారా లేదో వేచి చూడాలి. జిల్లా పరిషత్ అధికారులు సర్వసభ్య సమావేశంలో నాలుగు శాఖల సమస్యలతో మాత్రమే అజెండా ఏర్పాటు చేశారు. ప్రధానంగా వ్యవసాయం-అనుబంధ శాఖలు, వైద్య-ఆరోగ్యం, పారిశుధ్యం, విద్య శాఖలపై సర్వసభ్యసమావేశంలో చర్చ జరగనుంది. మిగతా శాఖలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని అధికారులు హాజరవుతారని జడ్పీ అధికారులు తెలిపారు. జిల్లాలో రాయితీ విత్తనాలు అరకొరే ఇస్తున్నారు. అవి కూడా నాసిరకమే. కౌలు రైతులకు రుణాలు, పథకాలు కూడ అరకొరగానే వస్తున్నాయి. దీని కోసం 4.50 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. విద్యాశాఖలో ఆర్‌టీఈ 12(1) సి చట్టం సరిగ్గా అమలు కావడం లేదు. పారిశుధ్య కార్మికులకు గత ప్రభుత్వంలో చివరి రెండేళ్ల నుంచి వేతనాలు చెల్లించడం లేదు. గ్రామాల్లో చెత్తను తరలించేందుకు చెత్త నిర్వహణ కేంద్రాలు అధ్వాన్నంగా ఉన్నాయి. వీటన్నిటిపై జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశంలో చర్చ జరగాల్సి ఉంది.

వాహనాల రాకపోకలకు అడ్డగింత


వాహనాలు నిలిపివేసి, పరిశ్రమ ప్రతినిధులతో చర్చిస్తున్న సీఐ, తహసీల్దార్

కొలిమిగుండ్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతుల రస్తాలు, ఇతర మినహాయింపు రోడ్లను ఇష్టానుసారంగా పరిశ్రమ అవసరాలకు వాడరాదని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వారికి మండల అధికారులు సూచించారు. ఇటీవల పెట్నికోట పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న అల్ట్రాటెక్ రెండవ ప్లాంటు నిర్మాణ పనులకు రైతులు, ఇండస్ట్రియల్ పార్క్‌కు సంబంధించిన రహదారులను వాడుతు న్నారు. దీంతో పెద్దఎత్తున ఎర్ర దుమ్ము సమీప పంట పొలాలను కప్పివేయడంతో పాటు ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తోందని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో శుక్రవారం కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసులు రహదారి వద్దకు చేరుకొని భారీ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పరిశ్రమ కోసం నూతనంగా రోడ్డు వేసుకొని రాకపోకలను కొనసాగించాలని అధికా రులు సూచించారు. ఈరహదారిని వాడుకోవడానికి ఇండస్ట్రియల్ పార్క్ అధికారులు తాత్కాలిక అనుమతులు ఇచ్చారని పరిశ్రమ ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పాణ్యం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పాణ్యం సమీపంలోని ఎస్పార్బీసీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన షబానా (30) నంద్యాలలో పరీక్ష రాసి తన భర్త ఇద్రూస్‌బాషతో కలిసి మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. అయితే పాణ్యం సమీపంలో షబానా చున్ని మోటారుసైకిల్ చక్రంలో ఇరుక్కొని కింద పడి వెనక వైపు నుంచి వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ కిందపడి మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



TO LET

Shops/Godowns:3 shops, near Bellary Chowrasta, good road access, sri lakshmi commercial complex, opp lane to 4th town Police Station, kurnool. Cell: **9494559221**

AJL-236547

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 237865

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్ల) కొరకు సంప్రదించండి.

99854 02121

ఆంధ్రజ్యోతి పత్రిక కోసం సంప్రదించండి.

99854 11364

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పైసలిస్తేనే పనులయ్యేది..!

● పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ.5 వేల నుంచి 10 వేలు డిమాండ్ ● ఇళ్లకు మీటర్లు బిగించడానికి వెయ్యి రూపాయలు

● ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సచివాలయ జేఎల్‌ఎంలు ● కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు, ప్రజలు

పాములపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతుల పొలాల్లో స్తంభాలే, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ముడుపులు చెల్లించి బ్రతిమాలితే గానీ పనులు చేయడం లేదు. పైగా ఎవరికీ చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ బహిరంగంగానే బెదిరిస్తున్నారు. అధికారుల అండతోనే సచివాలయ జేఎల్‌ఎంలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, డిపార్ట్‌మెంట్ రెగ్యులరు ఉద్యోగలకు కాకుండా మండలంలో ఉన్నాతాధికారులు సచివాలయ సిబ్బందికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఉద్యోగులు చర్చించుకొంటున్నారు. సిబ్బందిపై మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు ఫిర్యాదులు చేసినా నేటికి పట్టించుకోకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది.



పొలంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

స్తంభాల ఏర్పాటులో నిర్లక్ష్యం

మండలంలోని మిట్టకందాల, పాములపాడు, రుద్రవరం తదితర గ్రామాలలోని పంటపొలాల్లో కరెంటు స్తంభాలు నేలకొరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి గురించి పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతోందనని ఆందోళన చెందుతున్నారు. కొత్త స్తంభాలు కావాల్సిన రైతులు వారి పొలాల వద్దకు వారే ట్రాక్టర్ బాడుగలు, కూలీలు వెచ్చించి తెచ్చుకుంటున్నారు. ట్రాన్స్ ఫార్మర్‌లు కోసం రైతు సొంత ఖర్చులతో దిమ్మెలు ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఉంది. స్తంభాలు ఏర్పాటు చేసేటప్పుడు గుంతల్లో గుత్తేదారు చేసే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్తంభాలు నేల కొరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల దాకా వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

మీటరు బిగించాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందే

గ్రామాల్లో కరెంటు పని చేయాలంటే ఒక్కో పనికి ఒక్కోరేటు ఉంది. అది ప్రభుత్వం నిర్ణయించింది కాదు. సిబ్బంది పెట్టుకున్న రేటు. ఇంటికి కొత్తగా మీటరు తీసుకోవాలంటే మీ సేవలో చలానాతో సహా రూ.1,870 ఖర్చు అవుతుంది. అయితే అది బిగించాలంటే వెయ్యి రూపాయలు ఇవ్వాల్సిందే. ఇలా ఒక్కో పనికి ఒక్కో రేటు, వీటిగూర్చి ఉన్నతాధికారులకు తెలియచేస్తే మీ పనులు చేయమంటూ బెదిరిస్తుండటంతో ఊరుకొంటున్నారు.

విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

మండలంలో వేళపాల లేకుండా విద్యుత్ అధికారులు ఇష్టారాజ్యంగా కరెంటు కోతలు విధిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో కూడా కరెంటు లేకుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోవడం లేదు

రుద్రవరం గ్రామంలోని తన పంట పొలంలో కరెంటు స్తంభాలు నేలకొరిగి నెలలు కావొస్తుందని, ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి స్తంబాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

జేఎల్ఎంలు డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి లేదు. ఫిర్యాదులొస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉన్నప్పుడు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నాం.

- అబ్దుల్ అబీద్, ఏఈ

శ్రీశైలంలో వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న ఈవో

నంద్యాల ఎడ్యుకేషన్(శ్రీశైలం), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వార్లకు ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఊయలలో ఉంచి పుష్పాలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ ఈవో శ్రీనివాసరావు దంపతులు ఊంజల సేవ నిర్వహించారు.

అంకాళమ్మకు విశేష పూజలు

శ్రీశైలం క్షేత్ర గ్రామదేవత అంకాళమ్మ అమ్మవారికి ఆలయ అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం సర్కారీ సేవలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమో దకం, గంధోదకం, పుష్పోదకం తదితర విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు.

అలరించిన భక్తి గీతాలు

శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ధర్మపథం కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ మాడవీధిలో నిత్యకళారాధన వేదిక వద్ద శుక్రవారం సాయంత్రం నుంచి వనపర్తి సత్యం బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళారాధన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి: మంత్రి బీసీ



మంత్రి బీసీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈవో రామకృష్ణ

పాణ్యం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తూరు, కంబగిరి స్వామి ఆలయాల ఈవో రామకృష్ణ మంత్రి నివాసంలో కలిసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి శుద్ధజల కేంద్రాన్ని తన స్వంత నిధులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. నందివర్గం నుంచి కొత్తూరుకు డబల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. కంబగిరిస్వామి ఆలయానికి మంచినీటి సౌకర్యం, కల్యాణ మండపం, అకు నుంచి రహదారి, సత్రాల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. ఇందుకు టీటీడీ ద్వారా ప్రతిపాదనలు పంపి మంజూరు చేస్తామన్నారు కొత్తూరు ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి ఉన్నారు.

మహిళల జీవన ప్రమాణాలు పెంచాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయ సంఘాల మహిళల జీవన ప్రమాణాల మెరుగుదలకు, ఉపాధి కల్పించడానికి వార్షిక సూక్ష్మప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్డీఏ, వెలుగు అంశాలపై డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని అందుకు సంబంధించి పటిష్ట ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. పాడిపశువుల పెంపకంపై ఆసక్తి ఉన్న స్వయం సహాయ సంఘాలకు చేయూత అందజేయాలన్నారు. కిచెన్ గార్డెన్స్, కంపోస్ట్ పిట్స్‌కు సంబంధించి డ్వామా సిబ్బందితో సమన్వయం చేసుకొని పూర్తిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికోసం ఉన్నతీ పథకం కింద సున్నా వడ్డీతో రుణాలు మంజూరు చేశామన్నారు. రుణాలు తిరిగి చెల్లింపుపై సంఘాలకు అవగాహన కల్పించి వాటి వసూళ్లపై ఏపీఎంలు దృష్టి సారించాలన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు: ఎమ్మెల్యే



మిడుతూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

మిడుతూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వద్దని ఎమ్మెల్యే జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శాఖలవారిగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నారపల్లె చెరువు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు శివరామి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, జయరాముడు, రామస్వామి రెడ్డి, నాగేంద్ర, షబ్బు బాషా, నరసింహ గౌడు, రమణరెడ్డి, సోఫి సాహేబ్, అధికారులు పాల్గొన్నారు.

● మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం త్వరలో వస్తుందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. కాతా వారి నివాసం వద్ద టీడీపీ విస్తృతస్థాయి సమావేశం టీడీపీ మండల ఎన్నికల అబ్జర్వర్ నాగముని, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పాములపాడు: సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. పాములపాడులో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, కో కన్వీనర్‌లు, టీడీపీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అబ్జర్వర్ షాబుద్దీన్, మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, గోవింద్, వేణు, చంద్రశేఖర్, కృష్ణ, ఆదిరెడ్డి, కరీంబాషా, వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి, మోహన్‌గౌడ్, నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. కొత్తపల్లిలోని రాజరాజేశ్వరి పాఠశాలలో టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి అధ్యక్షతన మండల బూత్ యూనిట్ క్లస్టర్ క్లస్టర్లు, గ్రామ స్థాయి బూత్ ఇన్‌చార్జిలు, మండల కో కన్వీనర్లతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సర్పంచ్ చంద్రశేఖర్‌యాదవ్, నాయకులు లింగస్వామిగౌడు, చంద్రశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, వెంకటస్వామిరెడ్డి, శివారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, పాండురంగారెడ్డి, స్వామిరెడ్డి, జహరుల్లా, మోహన్, అమర్, శేఖర్, రహీంఖాన్, మన్సూర్, లింగన్న, రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం చంద్రబాబు కృషి

● న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల మండలంలోని పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన నిర్మలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద వచ్చిన రూ.1.5 లక్షల చెక్కును శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఎవరైనా నేరుగా వచ్చి సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి దరఖాస్తు చేసు కోవచ్చని చెప్పారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి

డీఐజీని కలిసిన మార్కెట్‌యార్డు చైర్మన్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్కెట్‌యార్డు చైర్మన్ గుంటుపల్లిహరిబాబు కర్నూలు రేంజి డీఐజీ కోయప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలులోని డీఐజీ కార్యాలయంలో కలిశారు. పలు విషయాలపై చర్చించిన అనంతరం డీఐజీని సత్కరించారు.

మహిళలను గౌరవించాలి: డీఎస్పీ



వడ్డెమానులో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ

నందికొట్కూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలను గౌరవించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. శుక్రవారం నందికొట్కూరు మండలం వడ్డెమాను గ్రామంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు, గ్రామ సర్పంచ్ రామచంద్రుడు, మాజీ సర్పంచ్ కట్టా సత్యంరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

నంద్యాల రూరల్ జూన్ 27(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 8వ తేదిన నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరిగే సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లధనాన్ని తీసుకు వస్తానని చెప్పి ఇప్పటి వరకు తీసుకురాలేదన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడి రాజీనామా

నందికొట్కూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాస గౌడ రాజీనామా చేశారు. శుక్రవారం తన రాజీనామా లేఖను ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు మెయిల్ ద్వారా పంపినట్లు ఆయన తెలిపారు. దేశం మీద పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడికి ప్రతి చర్యగా ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రధాని మోదీ బుద్ధి చెప్పారన్నారు. ఆపరేషన్ సింధూర్ పట్ల కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా చేసినట్లు, బీజేపీలో ఈనెల 30వ తేదీన నందికొట్కూరులో భారీ రీలీతో చేరుతున్నట్లు ఆయన తెలిపారు.

జీప్యాట్‌లో విద్యార్థుల ప్రతిభ

పాణ్యం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేటెడ్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీప్యాట్) 2025 ఫలితాల్లో శాంతిరాం ఫార్మసీ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముదుసూదన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉన్నత విద్యాశాఖ ద్వారా స్టైఫండ్ లభిస్తుందని చెప్పారు. శాంతిరాం ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్. అర్షియాకౌసైన్ దేశవ్యాప్తంగా 121వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. కళాశాల చైర్మెన్ డాక్టర్ శాంతిరాముడు, డైరెక్టర్ శివరాం, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్ ఉత్తమ ర్యాంక్ వచ్చిన విద్యార్థినిని అభినందించారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు



మిడుతూరులో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

మిడుతూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మిడుతూరులోని శ్రీకృష్ణ మందిరంలో గత నాలుగు రోజులుగా టీటీడీ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తొగట సురేష్ బాబు, ధర్మ ప్రచారకులు రామ్మోహన్, రామకృష్ణా రెడ్డి, చిట్టిబాబు, శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు సహాయ పరికరాలు

నందికొట్కూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని దివ్యాంగులు, వృద్ధుల కోసం అసెస్మెంట్ క్యాంపును ఎంపీ డా.బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఏడీఐపీ పథకం ద్వారా అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా ఇవ్వనున్న పరికరాలు, బ్యాటరీ ఆధారిత మోటార్ ట్రై సైకిల్, చేతితో నడిపే ట్రై సైకిల్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ వాకింగ్ స్టిక్స్, కృత్రిమ అవయవాలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ మరియు వృద్ధులు తదితర సర్టిఫికెట్ ఉన్న వారు శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి



పశువుల తొట్టిని పరిశీలిస్తున్న డ్వామా పీడీ సత్యనారాయణ

గోస్పాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం హార్టికల్చర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని, రైతులు వాటిని ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలని డ్వామా పీడీ సత్యనారాయణ సూచించారు. మండలంలోని జూలేపల్లె, పసురపాడు, ఒంటివెలగల గ్రామాల్లో శుక్రవారం ఉపాధి పనులను పరిశీలించారు. జూలేపల్లెలో పంటకుంటను, పసురపాడులో పశువుల తొట్టిని పరిశీలించారు. ఒంటి వెలగలలో ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పీడీ మాట్లాడుతూ హార్టికల్చర్ కింద మునగ, నేరేడు, కొబ్బరి, పూలతోటలు పొలాల్లో వేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీని ఇచ్చి రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తుందని అన్నారు. ఉపాధి కూలీల వేతనాలను త్వరలోనే పూర్తిస్థాయిలో వారి అకౌంట్లలో జమ చేస్తుందని చెప్పారు. ఏపీవో గంగన్న, ఈసీ శ్రీనివాసులు, టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.

PUBLIC NOTICE

UNDER The instruction of my clint M/s. Shriram FInance Limited, Chennai, Branch at Nanayal, I issue the following notice to general Public. My clintes intends to grant loan to **Smt. Iragadinla Siva Lakshmamma, I.Ram Babu, R/o. D.No: 1024, Siddapuram Village & Post, Atmakur Mdl, Nandyal Dt.,** by keeping the below mentioned property of them, as security by way of Registered Mortgage. As such if any one have any claim, charges, Mortgages, Sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in writing with in 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my clint in this regard.

Sy.No. 194-B2 pyki, Plot No.**7**, Total Extent : **Ac.0-03** Cents or **145.32** Sq.Yards. **Boundaries : East** : 20 feet wide Rastha, **West** : Land of Pondugala Chinnakka, **North** : Plot No.8, **South** : Plot No.6.

T.V. PRASAD
Advocate. Nandyal.

హోటళ్లలో తనిఖీలు

నంద్యాల టౌన్ జూన్27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు హోటళ్లలో సివిల్ సప్లై ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. శుక్రవారం పట్టణంలోని చార్మినార్, ఆదిత్య, రమ్య కేఫ్, టీస్టాల్‌ను తనిఖీ చేశారు. వివిధ హోటళ్లలో వాడుతున్న ఐదు డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసినట్లు సివిల్ సప్లై డీటీ ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేకంగా సిలిండర్లు, వాడినా, శుభ్రంగా లేకపోయిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూలనపడిన ‘స్వచ్ఛ భారత్’ సామగ్రి

● గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం



నెహ్రూనగర్‌లో మూలనపడిన మినీ ట్రాక్టర్

పగిడ్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు పాలక ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర పేరుతో అనేక అబివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాయి. అందులో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి అవసరమైన ట్రాక్టర్లు, ట్రై సైకిల్‌లను కొనుగోలు చేసి చెత్తను సేకరించేందుకు కార్మికులను నియమించి గ్రామాలను శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపడుతున్నారు. అయితే లక్షల రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్రైసైకిల్ మూలనపడటంతో ప్రభుత్వ ఆశయం నేరవేరడం లేదు. మూలనపడిన సామగ్రికి మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని తెలుస్తోంది. దీంతో రోడ్డపై చెత్తాచెదారం పడవేయడంతో రోగాల బారిన పడాల్సి వస్తోందని ప్రజలు భయాందోళన చెందుకున్నారు. గత టీడీపీ హయాంలో స్వచ్ఛ భారత్ పథకం కింద నెహ్రూనగర్ గ్రామానికి ఒక మిని ట్రాక్టర్‌ను, ట్రైసైకిళ్లను కేటాయించారు. గ్రామ జనాభా ఆధారంగా పారిశుధ్య కార్మికులను నియమించి వారిచే కాలనీలోని తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపంద కేంద్రాలలో నిల్వ చేసేందుకు వాటిని వినియోగించేవారు. అనతి కాలంలోనే అవి మరమ్మతులకు గురికావడంతో సిబ్బంది వాటిని పట్టించుకోకపోవడంతో మూలనపడ్డాయి. అధికారులు వాటి మరమ్మతులకు సంబంధించి చర్యలు తీసుకోవపోవడంతో పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించెందుకు ఇబ్బందిగా మారినట్లు ప్రజలు చెబుతున్నారు. దీంత నెహ్రూనగర్ సచివాలయం సమీపంలో మూడేళ్లగా మినీ ట్రాక్టరు, ట్రై సైకిల్ మూలనపడి ఉన్నాయి. దీంతో గ్రామలో చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయడంతో పందులకు నిలయంగా మారి దుర్వాసన వెదజలుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. చెత్తను తీసుకుని వేళ్లేందుకు అవసరమైన సామగ్రి మూలనపడటం, కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవకపోవడంతో పలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో ఏడుగురు పారిశుధ్య కార్మికులు ఉండగా ప్రస్తుతం కేవలం ఇద్దరు మాత్రమే ఉండటంతో గ్రామంలో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో కాలనీలలో చెత్తాచెదారం పేరుకొనిపోయి ప్రజలు రోగాలబారిన పడాల్సివస్తుందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై పంచాయితీ కార్యదర్శి మల్లికార్జునను వివరణ కోరగా సామగ్రికి మరమ్మతులు చేపట్టాలని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.



నెహ్రూనగర్‌లో రోడ్డుపై వేసిన చెత్తాచెదారంలో పందుల విహారం

తెలుగుగంగ సబ్ చానల్ వంతెన పరిశీలన



కుంగిపోయిన వంతెనను పరిశీలిస్తున్న క్రాంతికుమార్

మహానంది, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం సమీపంలోని తెలుగుగంగ 13వ బ్లాక్ సబ్‌చానల్ పరిధిలో కుంగిపోయిన వంతెనను శుక్రవారం తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చింతం క్రాంతికుమార్ యాదవ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సాగు నీరుకు సబ్ చానల్ ద్వారా ఎంతో ఉపయోగం అని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మరమ్మత్తులపై తెలుగు గంగ అధికారులతో మాటాడతామని చెప్పారు. రైతులు ఉన్నారు.

మహానందిలో ఫారెస్టు అకడమిక్ డీడీ పూజలు

మహానంది, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం ఉదయం అటవీశాఖ అకడమిక్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖమండపం వద్ద ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాణా ప్రతాప్ ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో ఆయన స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో వేదపండితులు వీరిని శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

అక్రమార్కుల పాగా..

- ప్రభుత్వ స్థలాల్లో బంకులు ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు
- ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమతం

డోన్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో మిగిలిపోయిన ఖాళీ స్థలాలను కొంత మంది బడాబాబులు కబ్జాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని పరిరక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని పాతబస్టాండు నుంచి రైల్వేస్టేషన్ వంద అడుగుల రోడ్డులో యథేచ్ఛగా బంకులు ఏర్పాటుచేస్తున్నారు. ఇదే స్థలంలో ఓ వ్యక్తి బంకును ఏర్పాటు చేసుకోగా సంబంధిత అధికారులు హుటాహుటిన తొలగించారు. అదే స్థలంలోనే మరో వ్యక్తి బంకు ఏర్పాటు చేస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తో పలు అనుమానాలకు తావు ఇస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే పాత బస్టాండు నుంచి బ్రిడ్జి వెళ్లే 60 అడుగుల రోడ్డులో ప్లైఓవర్ కింద, జిల్లా పరిషత్ ఇన్‌స్పెక్షన్ గెస్ట్ హౌస్ ముందు ఓ వ్యక్తి బంకులను ఏర్పాటు చేసి బాడుగలకు ఇస్తూ జేబులు నింపుకుంటున్నాడు. అలాగే మున్సిపల్ కాంప్లెక్స్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ బిల్డింగ్ పక్కన కొద్దిపాటి స్థలం కూడా కబ్జా చేశారని అధికారులకు పలువురు ఫిర్యాదు చేసినా మిన్నకుండి పోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అదే విధంగా పట్టణంలోని జాడీల ఫ్యాక్టరీ ముందు ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని కబ్జా చేసి బంకులు ఏర్పాటు చేసుకుని బాడుగలకు ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలా ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేయడం, అందులో బంకులు ఏర్పాటు చేసి ఒక్కొక్క బంకు నెలకు రూ.3వేలు నుంచి రూ.5వేలు బాడుగలకు ఇస్తూ సొమ్ము చేసుకుంటూ నెలలో వేలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా బంకులు ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంకులు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.


ప్లై ఓవర్ కింద ఏర్పాటు చేసుకున్న ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు


గతంలో తొలగించిన చోటే మళ్లీ ఏర్పాటు చేసిన బంక్

● సర్వే చేసి తొలగిస్తాం



పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న బంకుల నిర్వాహకులు మున్సిపాలిటీకి ఎంక్రోజ్‌మెంటు ఫీజు చెల్లించి ఉండాలి. లేనియెడల టౌన్ ప్లానింగ్ అధికారులతో సర్వే చేయించి తొలగిస్తాం. రోడ్డును కబ్జా చేసి అక్రమంగా బంకులు ఏర్పాటు చేసుకోరాదు.

- ప్రసాద్‌గౌడు, మున్సిపల్ కమిషనర్, డోన్

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం


ర్యాలీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లలిత

బనగానపల్లె, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు సర్వనాశనం అవుతున్నాయని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లలిత అన్నారు. నశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కోట్లాది మంది మాదకద్రవ్యాల మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవడమేగాక సమాజానికి హాని చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాబునాయక్, సూర్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహమ్మద్‌గౌస్, బడేసాహెబ్, వసుంధరమ్మ, నీతమ్మ, రామకృష్ణ, ఉమామహేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, రమన్న, వరలక్ష్మి, రవికుమార్, చంద్రకళ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి


బ్యాంకును ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ మిశాంత్య

సంజామల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని జనరల్ మేనేజర్ మిశాంత్య కోరారు. సంజామలలో నూతనంగా నిర్మించిన కెనరా బ్యాంకు భవనాన్ని శుక్రవారం రీజనల్ ఏజీఎం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ తరుణ్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంకు ఖాతాదారులకే విశేష సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస రెడ్డి, సుధీర్, రాజశేఖర్, కాశేశ్వరరావు, వేణు, శ్రీనివాసులు, వెంకటేష్ , ఉపేంద్ర, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో..

కోవెలకుంట్ల: పట్టణంలోని నాగలకట్ట సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకును జనరల్ మేనేజర్ మిశాంత్య శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు జీఎం సుశాంత్ కుమార్, కోవెలకుంట్ల బ్రాంచ్ మేనేజర్ సద్దామ్ హుసేన్ ఆలీ, ఉప సర్పంచ్ జీలేబ్ నూర్జిరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం నాయకుడు రవీంద్రనాథరెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

1,200 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం

చాగలమర్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలో 1,200 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని ఉపాధిహామీ ఏపీడీ సాంబశివరావు తెలిపారు. శుక్రవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎపీఓల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు క్లస్టర్ పరిధిలో 600 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు రైతులను గుర్తించామని అన్నారు. కాంపోస్టు పిట్లపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. క్లస్టర్ పరిధిలో 16 వేల కంపోస్టు పిట్లను రైతులు ఏర్పాటుచేసేలా ప్రోత్సహించాలని అన్నారు. సామాజిక తనిఖీకి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

● మండల సమావేశంలో ఎంపీపీ భాగ్యమ్మ


సమస్యను వింటున్న ఎంపీపీ, ఎంపీడీవో

ఉయ్యాలవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ బుడ్డ భాగ్యమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివారు. స్థానిక ప్రాథమిక వైద్యశాలలో డ్రైనేజీ సమస్య ఉందని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య సభ దృష్టికి తెచ్చారు. దీనికి గ్రామాభివృద్ధి అధికారి జయరామిరెడ్డి స్పందిస్తూ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో ఉమా మహేశ్వరమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

షిరిడీ క్షేత్ర అన్నదానానికి డోన్ భక్తుల వితరణ

డోన్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని మాదు రోజుల పాటు అనంతపురం షిరిడీ సాయిబాబా సేవా సమితి మహా అన్నదాన కార్యక్రమాన్ని షిరిడీలో నిర్వహించనుంది. ఈ మేరకు తమ వంతు భక్తులుగా డోన్ పట్టణానికి చెందిన షిరిడీ సాయిబాబా భక్తులు, సంజీవని మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్నదానానికి కావాల్సిన సామగ్రిని సేకరించి మినీ లారీ ద్వారా అనంతపురం సేవా సమితి సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంజీవని మిత్ర బృందం సభ్యులు సురేష్‌గౌడు, సందు నాగరాజు, చిట్యాల లోకేశ్‌గౌడు, భాస్కర్‌గౌడు, కమలాపురం బొబ్బల శివరామిరెడ్డి, ఏసురుమిత్ర భాస్కర్‌గౌడు, తాండవాడు నగరేశునిని ఎద్దుపెంట రంగయ్య, దొరపల్లి నాగరాజు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యుకొత్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో పీడర్‌కు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున డోన్ మార్కెట్‌యార్డు, జూనియర్ కాలేజీ, రైల్వేస్టేషన్, సీపీఎం కార్యాలయం, కోదండరామాలయం, కోరిబాలు, త్రివర్ణ కాలనీ, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి


స్వామివారిని దర్శించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభి రుచి మధు

శిరివెళ్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో స్వయంభువుగా వెలసిన సర్వలక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభి రుచి మధు తెలిపారు. సర్వ నారసింహుడి ఆలయంలో శుక్రవారం ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముందు భాగంలో నిలిచిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆర్‌ఎండీవీ, ఆటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు

చాగలమర్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిన్నమసీదు వీధిలో ప్రధాన పీర్లను శుక్రవారం కొలువుదీర్చారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాలు చేశారు. కొటగడ్డ వీధిలో పెద్దసాయబ్ హుసేన్‌స్వామి పీర్ల ఉత్సవాన్ని 28న నిర్వహిస్తారు. 3న పోలీసు స్టేషన్ సమీపంలోని హసన్, హుసేన్ పీర్లు జరుగుతాయి. 4న గుర్రంపై అలీఅక్బర్ పీరును కొలువుదీర్చి చేసి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 5న ప్రధాన పీరైన లాల్‌స్వామిని దిగిలి మధ్య రాత్రిసరిగెత్తు నిర్వహిస్తారు. 6న హిందూ, ముస్లింలు ఐకమత్యంతో గంధం చల్లుకుంటూ లాల్‌స్వామిని ఊరేగింపు చేస్తారు. 7న జరిగే జియారత్‌తో మొహర్రం ముగుస్తుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మొహర్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.


చాగలమర్రిలో కొలువుదీరిన లాల్‌స్వామి పీర్లు

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి: మంత్రి

బనగానపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వినతులను మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఉద్యోగులు బీసీకి వినతిపత్రం సమర్పించారు. 2006 నుంచి తాము పని చేస్తున్నామని తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఉపాధి సిబ్బందికి హామీ ఇచ్చారు. బాధితుల వినతులు స్వీకరించి అప్పటికప్పుడే కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్‌లు చేసి పరిష్కరించారు. కొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని ఆదేశించారు. సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు సేవలందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.


మంత్రి బీసీకి వినతిపత్రం ఇస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు

డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలి

పట్టణంలో అండర్ డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. శుక్రవారం పాతబస్టాండ్ సమీపంలోని డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు ఇచ్చారు. ప్రజల సౌకర్యార్థం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డీడీ రమణయ్య

బనగానపల్లె, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జీవాలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య కోరారు. శుక్రవారం బనగానపల్లె ప్రభుత్వ పశువైద్యశాలలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవాలలో అంతర పరాన్నజీవుల నిర్మూలన కార్యక్రమాన్ని జూలై 10 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లె పశువైద్యశాఖ ఏడీ మారుతీ సకారం మాట్లాడుతూ పశువుల్లో కేవలం ఆడదూడలు పుట్టే ఎద సూదులను రూ.150కే ప్రభుత్వం అందిస్తుందన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హుసేన్, కుమారెడ్డి, ఐశ్వర్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీటీగా కిశోర్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్యాపిలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిప్యూటీ తహసీల్దారుగా కిశోర్ కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మారుతి ఏడాది క్రితం బేతంచెర్లకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. అయితే మిడుతూరులో పని చేస్తున్న కిశోర్ కుమార్‌రెడ్డి బదిలీపై వచ్చారు.

పల్లెపల్లెకూ దండోరా ..


దండోరా జెండాను అందిస్తున్న సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు

కొలిమిగుండ్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాదిగ జాతిని అన్ని విధాలా సన్నద్ధం చేయడానికి పల్లెపల్లెకూ దండోరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు, కోవెలకుంట్ల ఇన్‌చార్జి ఐరికమాను నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ 31వ వార్షికోత్సవం సందర్భంగా మండలవ్యాప్తంగా మాదిగ ఆదేశాలమేరకు పల్లెపల్లెకూ దండోరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దన్న, రాజమౌళి పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

డోన్ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా నాయకురాళ్లు మహేష్ బేగం, సీఐటీయూ నాయకులు చిన్నరెహిమాన్, నక్కి, శ్రీకాంత్ కోరారు. శుక్రవారం పట్టణంలోని త్రివర్ణ కాలనీలో ఐద్వా నూతన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

కోవెలకుంట్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బైక్ నడిపే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ముడిగేడు సర్కిల్ వద్ద ఎస్ఐ వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్, పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

బాధితులకు ఆర్థిక సాయం

చాగలమర్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన మహేంద్ర కుటుంబానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వైసీపీ తరఫున రూ.35 వేలు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి, వైసీపీ నాయకులు వెంకటరమణ, సర్పంచ్ గోవిందయ్య, శేషురమేష్, వీరయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ

బనగానపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మ వారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

ఆళ్లగడ్డ, జూన్ 27(ఆం ధ్రజ్యోతి): విరి విగా మొ క్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని, బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని వ్యక్తి యువ సేవా సమితి వ్యవ స్థాపకురాలు లావణ్య అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డలోని విశ్వరూప నగర్‌లోని కాళిమాత ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధ, సభ్యులు క్రిష్ణమాచారి, రామాచారి పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన

డోన్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తోనే సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని దొరపల్లె, లక్కిసాపల్లె, మల్లెంపల్లె, బొంతి రాళ్ల వెంకటాపురం, గుమ్మకొండ గ్రామాల్లో బీజేపీ నాయకులు హె మసుందర్ రెడ్డి, ఆర్వీ రామయ్య నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీ నాయకులు హెచ్‌కే హరి నాయుడు, ఎం.శివశంకర్, కార్యకర్తలు ఉన్నారు.

యర్రగుంట్లలో చోరీ

శిరివెళ్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన తిమ్మయ్య అనే వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు పొలానికి వెళ్లగా దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలోని నగదును అపహరించుకుని వెళ్లారని బాధితుడు తిమ్మయ్య వాపోయాడు. సమాచారం తెలుసుకున్న శిరివెళ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం స్టేషన్ పరిధిలోని కైప గ్రామానికి చెందిన సర్వలత(26) భర్త వేధింపులు తాళలేక విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం జరిగింది. భర్త సంజన్న తాగుడుకు బానిసై నిత్యం గొడవపెట్టుకునేవాడు. గురువారం సాయంత్రం ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సర్వలత ఆత్మహత్యాయత్నం చేసింది. బనగానపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు, ఒక కూతురు సంతానం అని తెలిపారు. సంజన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శాకంబరి అలంకారంలో పార్వతీదేవి


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయంలో ఆషాడమాసం సందర్భంగా శుక్రవారం పార్వతీదేవి శాకంబరి అలంకారంలో కొలువుదీరారు. మహిళలు పార్వతీదేవికి కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరించ చేసి ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. సామూహికంగా విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. కన్యకా రమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ట్రాన్స్‌జెండర్ మృతిపై కేసు నమోదు

శిరివెళ్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన గద్దం రవి కుమార్(22) అనే ట్రాన్స్‌జెండర్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాలివి.. రవి కుమార్ కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడన్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 26వ తేదీన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్య శాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. మృతుని తండ్రి గద్దం శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కొలిమిగుండ్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని అంకిరెడ్డిపల్లె ప్రాథమిక మెయిన్ పాఠశాల హెచ్ఎం ఆదిశేషయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలంటూ గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి హెచ్ఎం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే పథకాలు, ఇతర మౌలిక సదుపాయాలు, విద్యా బోధనపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు రాజశేఖరరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంఈవోలు అనూరాధ, నాగమలుద్దు శుక్రవారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యామిత్ర కిట్ల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతగల భోజనం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుధాకర్‌గుప్త, విజయరాజు, సీఆర్పీ ఆమీర్‌బాషా పాల్గొన్నారు.

వక్ఫ్ బచావో సభను జయప్రదం చేయండి

చాగలమర్రి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పట్టణంలో 30న నిర్వహించనున్న వక్ఫ్‌బచావో దస్తూర్‌బచావో బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆలిండియా ట్రస్టు చైర్మన్ మౌలానా అబ్దుల్‌మజీద్ ఆరీఫ్ కోరారు. శుక్రవారం చాగలమర్రిలోని మర్కస్‌మసీదులో నంద్యాల ముస్లిం జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌సవరణ బిల్లుకు వ్యతిరేకంగా జరిగే సభకు ముస్లింలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జేఏసీ సభ్యులు మౌలానా జాకీర్‌హుస్సేన్, ఖలీలుహ్మద్, ముస్తాఫా, తానిష్, హఫీజ్, జానీదాదూబా, మహమ్మద్, సులేమాన్, మహబూబ్‌బాషా, హాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు తనిఖీ

కోవెలకుంట్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలింగ్ స్టేషన్లను శుక్రవారం తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, సర్వేయరు వీరన్నతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 45 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. మౌలిక వసతులకు సంబంధించి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు ఎంపిక


ధరణి


హరిప్రియ


నాగేంద్రబాబు


తులసీశ్వరుడు

రుద్రవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు కస్తూర్బాగాంధీ విద్యాలయ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, యల్లవత్తుల ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. కస్తూర్బా పాఠశాల నుంచి ధరణి కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి, హరిప్రియ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి, యల్లవత్తుల ఉన్నతపాఠశాల విద్యార్థులు నాగేంద్రబాబు, తులసీశ్వరుడు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

రుద్రవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యులు ఆమరనాథరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శివచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలమూరు గ్రామంలో విద్యార్థులు, వైద్యులు మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోదకాలు వంటి వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ఆడ దోమ కుట్టడం వల్ల చలి జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వస్తాయన్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్ఎం మాదలేటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు టీడీపీ లక్ష్యం

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బేతంచర్ల- కర్నూలు రహదారిలో గోరుమానుకొండ సమీపంలో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో డోన్ ఆర్డీవో నరసింహులు, ప్రిన్సిపాల్ దేవేంద్ర కుమార్, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రామునిరెడ్డి, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లను నిలపాలి

బేతంచర్ల రైల్వేస్టేషన్‌లో అన్ని ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని సీపీఐ నాయకులు బార్గవ్ ఆధ్వర్యంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు తిరుమలేష్, దస్తగిరి, పి.నాగరాజు, ఏఐవైఎఫ్ ఎంవి, ఏఐటీయూసీ సూర్య చంద్రుడు, ప్రదీప్, మధు, ఏపీ ప్రజానాట్యమండలి చంటి ఉన్నారు.